# 179 బిడ్లు.. రూ.56.74 కోట్లు

## చిన్నతరహా ఖనిజాల మొదటి దశ వేలం పూర్తి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చిన్న తరహా ఖనిజాల మొదటి దశ వేలం విజయవంతంగా పూర్తయినట్టు గనుల శాఖ ప్రకటించింది. దీనిలో భాగంగా మూడు ఖనిజాలకు సంబంధించిన 25 బ్లాకుల్లో 19 బ్లాకులకు ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో రూ.56.74 కోట్లకు బిడ్లు దాఖలైనట్టు వెల్లడించింది. వీటిలో ఓ కలర్ గ్రానైట్ బ్లాక్ (3.61 హెక్టార్లు)తోపాటు 4 లాటరైట్ బ్లాకులు (15.834 హెక్టార్లు), 14 స్టోన్ అండ్ మెటల్ బ్లాకులు (47.125 హెక్టార్లు) ఉన్నట్టు వివరించింది. వీటి రిజర్వు ధర రూ.5,63,62,600గా నిర్ణయించగా.. తుది బిడ్ మొత్తం రూ.56,74,12,600గా ఉన్నట్టు తెలిపింది. మొత్తం 179 బిడ్లు దాఖలైనట్టు పేర్కొన్నది. ఇక ప్రతినెలా ఖనిజాల వేలం నిర్వహించాలని భావిస్తున్నది.

### వేలం వేసిన ఖనిజాల వివరాలు

| ఖనిజం | వేలం వేసిన బ్లాకులు | బిడ్ల సంఖ్య | రిజర్వు ధర (రూ.) | తుది బిడ్ మొత్తం (రూ.) |
|---|---|---|---|---|
| కలర్ గ్రానైట్ | 1 | 5 | 29,04,000 | 4,99,79,000 |
| లాటరైట్ | 4 | 39 | 63,33,600 | 15,89,58,600 |
| స్టోన్ అండ్ మెటల్ | 14 | 84 | 4,71,25,000 | 35,84,75,000 |
| మొత్తం | 19 | 128 | 5,63,62,600 | 56,74,12,600 |

# గ్రాన్యూల్స్ లాభం 152 కోట్లు

హైదరాబాద్, మే 28: ప్రముఖ ఫార్మా దిగ్గజం గ్రాన్యూల్స్ ఇండియా నికర లాభంలో 17 శాతం వృద్ధిని కనబరిచింది. ఫార్ములేషన్ విభాగంలో అమ్మకాలు భారీగా పుంజుకోవడంతో గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.152 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.130 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,176 కోట్ల నుంచి రూ.1,197 కోట్లకు పెరిగినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.4,482 కోట్ల ఆదాయంపై రూ.501 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని గడించింది. మరో వైపు రూ.1 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.1.5 తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.



# పారిశ్రామికానికి బీటలు

## ఎనిమిది నెలల కనిష్ఠస్థాయికి పడిపోయిన వృద్ధి

- ఏప్రిల్ నెలలో 2.7 శాతంగా నమోదైన ఐఐపీ
- గతేడాదితో పోలిస్తే పడిపోయిన ప్రగతి

నూఢిల్లీ, మే 28: పారిశ్రామికం మళ్లీ పడకేసింది. ఆర్థిక వృద్ధిలో నాలుగో స్థానానికి చేరుకోనున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ సర్కార్‌కు పారిశ్రామిక ప్రగతి రూపంలో గట్టి షాక్ తగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే ఢీలాపడింది. రికార్డు స్థాయిలో పెరుగుతూ వచ్చిన పారిశ్రామిక ప్రగతికి బ్రేకులు పడ్డాయి. తయారీ రంగంతోపాటు గనులు, విద్యుత్ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో ఐఐపీ ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలలో కేవలం 2.7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.2 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. మార్చి నెలలో నమోదైన వృద్ధి రేటును మళ్లీ సవరించింది. గతంలో 3 శాతంగా ఉంటుందని అంచనాను విడుదల చేసిన గణాంకాల శాఖ ఈసారి దీనిని 3.9 శాతానికి సవరించింది.

### ఢీలా పడిన తయారీ, గనులు

దేశ వృద్ధి, పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న తయారీ రంగంలో నిస్తేజం ఆవహించింది. గత కొన్ని నెలలుగా పరుగులు పెట్టిన తయారీ రంగం వెనుకంజవేసింది. గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి 3.4 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 4.2 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. దీంతోపాటు గనుల రంగంలో వృద్ధి ప్రతికూలానికి పడిపోయింది. దేశవ్యాప్తంగా ఉన్న గనుల్లో ఖనిజ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి మైనస్ 0.2 శాతానికి పడిపోయింది. అంతక్రితం ఏడాది ఇది 6.8 శాతంగా నమోదైంది. అలాగే విద్యుత్ రంగంలో వృద్ధి ఒక్క శాతానికి పరిమితమైంది. ఏప్రిల్ 2024లో ఇది 10.2 శాతంగా ఉన్నది.

### క్యాపిటల్ గూడ్స్ సెగ్మెంట్ ఫర్వాలేదు..

ఇతర రంగాలతో పోలిస్తే క్యాపిటల్ గూడ్స్ రంగం అంచనాలకుమించి రాణించింది. గత నెలలో ఈ రంగంలో వృద్ధి 20.3 శాతంగా నమోదైంది. ఏడాది క్రితం ఇదే నెలలో నమోదైన 2.8 శాతంతో పోలిస్తే భారీగా పెరిగింది. ఏడాది క్రితం ఇదే నెలలో 10.5 శాతం వృద్ధిని కనబరిచిన కన్స్యూమర్ డ్యూరబుల్ విభాగం ఈసారికిగాను 6.4 శాతంతో సరిపెట్టుకున్నది. మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలు కూడా పడకేశాయి. ఈ రెండు విభాగాలు నాలుగు శాతం వృద్ధితో సరిపెట్టుకున్నాయి. గతేడాది వచ్చిన వృద్ధి 8.5 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. ప్రాథమిక వస్తువులు 0.4 శాతం మాత్రమే కనబరిచాయి.

### కీలక రంగాలది అదే దారి

కీలక రంగాలు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలకుగాను ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి పడిపోతూ 0.5 శాతంగా నమోదైంది. క్రూడాయిల్, సహజ వాయువు రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణం. ప్రతీకార సుంకాలపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో గతేడాది 4.6 శాతంగా నమోదైన వృద్ధి ఈసారి తిరోగమన బాటపట్టింది.



| రంగం | ఏప్రిల్-2025 | ఏప్రిల్-2024 |
|---|---|---|
| పారిశ్రామిక ప్రగతి | 2.7% | 5.2% |
| తయారీరంగ వృద్ధి | 3.4% | 4.2% |
| గనుల రంగ వృద్ధి | -0.2% | 6.8% |
| విద్యుత్ రంగం | 1% | 10.2% |
| ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/నిర్మాణ రంగం | 4% | 8.5% |
| ప్రాథమిక వస్తువుల అవుట్‌పుట్ | -0.4% | 7% |

# రెండోరోజూ నష్టాల్లో సూచీలు

ముంబై, మే 28: స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టపోయాయి. ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థ ఐటీసీ షేరు కుదేలవడం మొత్తం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఒక దశలో 300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 239.31 పాయింట్లు కోల్పోయి 81,312.32 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 73.75 పాయింట్లు కోల్పోయి 24,752.45 వద్ద స్థిరపడింది. ఈవారంలోనే జీడీపీ గణాంకాలతోపాటు పారిశ్రామిక సూచీ విడుదలకానుండటంతో మదుపరులు అప్రమత్తకు మొగ్గుచూపారు. ఫలితంగా ఎఫ్‌ఎంసీజీ, వాహన, ఫార్మా రంగ షేర్లు పతనం చెందగా..బ్యాంకింగ్, పీఎస్‌యూ, మీడియా, ఎనర్జీ రంగ షేర్లు కదంతొక్కాయి. బ్రిటిష్ మల్టినేషనల్ బీఏటీ సంస్థ ఐటీసీలో తన వాటాను 2.5 శాతం మేర తగ్గించుకుంటున్నట్టు ప్రకటించడంతో ఐటీసీ షేరు కుప్పకూలింది. ఒక దశలో ఐదు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3 శాతం నష్టపోయింది. దీంతోపాటు ఇండస్‌ఇండ్, నెస్లె, అల్ట్రాటెక్, మహీంద్రా, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా షేర్లు పతనం చెందాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా ఎఫ్‌ఎంసీజీ 1.33 శాతం నష్టపోగా, మెటల్, వాహన, కన్స్యూమర్ డ్యూరబుల్, కమోడిటీస్ షేర్లు దిగువముఖం పట్టాయి. కానీ, ఆర్థిక సేవలు, ఇండస్ట్రియల్స్, టెలికాం, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.



# డీ-మెర్జ్ కానున్న బీఏఎస్ఎఫ్

హైదరాబాద్, మే 28: ప్రముఖ పురుగుల మందుల తయారీ సంస్థ బీఏఎస్ఎఫ్..దేశీయ మార్కెట్లోకి మరో రెండు రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చింది. వరి పంటపై వచ్చే పాముపొడ తెగులు నివారణ కోసం వాలెక్సియోతోపాటు సుడి దోమను నియంత్రించే శిలీంద్రనాశిని మిబెల్యాను ప్రవేశపెట్టినట్టు కంపెనీ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ తెలిపారు. వీటిలో వాలెక్సియో 60 ఎంఎల్ ధర రూ.1,750గాను, మిబెల్యా 120 ఎంఎల్ ధర రూ.1.090గా నిర్ణయించింది. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ప్రతియేటా 2 ఉత్పత్తుల చొప్పున 10 రకాల కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని వేరుచేసే ప్రక్రియ కొనసాగుతున్నదని, వచ్చే 18 నుంచి 24 నెలల్లో ఇది పూర్తికానున్నట్టు చెప్పారు.

# ఎస్బీఐ 26 వేల కోట్ల రైటాఫ్

## 2024-25లో భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేసిన బ్యాంకింగ్ దిగ్గజం









న్యూఢిల్లీ, మే 28: ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ బ్యాంకులు భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేశాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వరంగ బ్యాంకుల కన్నా ప్రైవేట్ రంగ బ్యాంకులు అన్ సెక్యూర్డ్ రుణాలను పెద్దమొత్తంలో రైటాఫ్ చేశాయి. వీటిలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అత్యధికంగా రూ.26 వేల కోట్లకు పైగా రుణాలను తన బ్యాలెన్స్ షీట్స్ నుంచి తీసివేసింది. అంతక్రితం ఏడాది రైటాఫ్ చేసిన రూ.17,645 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రూ.10 వేల కోట్లకు పెరిగాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకులు అధిక మొత్తంలో రుణాలను రైటాఫ్ చేయడం విశేషం. గతేడాది ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,271 కోట్ల రుణాలను తన ఖాతా పుస్తకం నుంచి తొలగించింది. 2023–24లో రైటాఫ్ చేసిన రూ.6,091 కోట్ల కంటే ఇది 50 శాతం అధికం. అలాగే యాక్సిస్ బ్యాంక్ కూడా రూ.11,833 కోట్ల మొండి బకాయిలను తన ఖాతాలోంచి తీసివేసింది.

### ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాలే..

చిన్నస్థాయి రుణాలు తీసుకొని ఎగ్గొట్టే వారు అధికంగా ఉంటున్నారని రిజర్వు బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. వీటిలో ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రంగాల్లో అత్యధికంగా ఉంటున్నాయని, వీటిని తగ్గించడానికి బ్యాంకులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని హెచ్చరిస్తున్నది. పూచీకత్తు లేకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నాయని, వీటి వల్ల ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులపై ప్రతికూల ప్రభావం పడనున్నదని గతంలోనే రిజర్వు బ్యాంక్ హెచ్చరించింది. అయినప్పటికీ బ్యాంకులు రుణాలు ఇవ్వడం మానడం లేదు. కఠిన నిబంధనలు విధించడం వల్ల బ్యాంకుల రుణ వితరణకు బ్రేక్‌లు వేయవచ్చునని, దీనివల్ల చిన్న వ్యాపారాలు, వ్యక్తులు, రుణాలు పొందడం కష్టతరం కానున్నది. అయినప్పటికీ గడిచిన మూడేండ్లలో రైటాఫ్ అయిన రుణాల్లో 20 శాతం రికవరి కావడం విశేషం.

# సేంద్రియ వ్యవసాయ మిషన్‌కు ఎంపికైన నాళేశ్వర్



రైతులతో వ్యవసాయశాఖ అధికారులు

నవీపేట, మే 28: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పద్ధతుల నేపథ్యంలో జాతీయ స్థాయి పథకం నేషనల్ ఆన్ నేచురల్ ఫార్మింగ్(ఎన్ఎంఎన్ఎఫ్)కు మండలంలోని నాళేశ్వర్ గ్రామం ఎంపికైనట్లు మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద మొదటి విడుతగా గ్రామానికి చెందిన 125 మందిని ఎంపిక చేసి ప్రతి రైతూ ఎకరం సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ఇద్దరు మహిళా రైతులను నియమిస్తామని అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలను సమకూర్చుకొని భూసార పరీక్షలు నిర్వహించి సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం వైపు రైతులను మళ్లించేందుకు కృషి చేస్తున్నట్లు ఏవో పేర్కొన్నారు. తమ గ్రామాన్ని మొదటి విడుతలోనే సేంద్రియ వ్యవసాయ గ్రామంగా ఎంపిక చేయడం ఆనందంగా ఉన్నదని మాజీ సర్పంచ్ ద్యాగ సరిన్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామంలో రైతులు సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ చైతన్యంతోనే కశ్మీర్‌లో మార్పు



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీనివాస్

బోధన్/సుభాష్‌నగర్, మే 28 : సమాజ చైతన్యంతోనే కశ్మీర్‌లో మార్పు వస్తుందని, ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచ దేశాలకు భారత్ గొప్పతనం తెలిసిందని ప్రముఖ చరిత్రకారుడు ఎన్‌వీకే ప్రసాద్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు దామోదర వినాయక సావర్కర్ జయంతి సందర్భంగా బుధవారం నగరంలోని న్యాల్‌కల్‌రోడ్ పట్టణ మున్నూరుకాపు కల్యాణ మండపంలో, బోధన్ పట్టణంలోని పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఇతిహాస సంకలన సమితి (భారతీయం) ఆధ్వర్యంలో 'కశ్మీర్ చరిత్రలో వక్రీకరణలు – వాస్తవాలు' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జమ్ముకశ్మీర్ అధ్యయన మండలి దక్షిణ ప్రాంత ప్రతినిధి ఎన్‌వీకే ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగం చేశారు. దేశకోసం జీవితాన్నే సమర్పించుకున్న స్వాతంత్ర్య సమరయోధుడు వీర సావర్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని యువతకు సూచించారు. సావర్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హైకోర్టు న్యాయవాది కాటిపల్లి మహేందర్‌రెడ్డి, సంకలన సమితి కార్యదర్శి కందకుర్తి ఆనంద్, మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. బోధన్‌లో సదస్సుకు అధ్యక్షత వహించిన జిల్లా యువజన అధికారి, ఇతిహాస సంకలన సమితి జిల్లా ఉపాధ్యక్షురాలు శైలి బెల్లాల్ మాట్లాడుతూ వాస్తవాలతో కూడిన చరిత్రను భావితరాలకు అందించేందుకు తమ సంస్థ పనిచేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో ఇతిహాస సంకలన సమితికి చెందిన చరిత్ర పరిశోధకుడు కందకుర్తి ఆనంద్, బోధన్ ఏకచక్ర సేవా సమితి అధ్యక్షుడు అంకు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై లైంగికదాడి..ఒకరిపై పోక్సో కేసు

భీమ్‌గల్, మే 28: బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏండ్ల బాలిక ఖాళీ సీసాలు, చెత్త ఏరుకుని జీవిస్తున్నది. బడాభీమ్‌గల్‌లోని తన నాయనమ్మ ఇంటికి వెళ్లిన సమయంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అతడు బాధితురాలికి మాయమాటలు చెప్పి లొంగదీసుకుని లైంగికదాడికి పాల్పడ్డాడు. ప్రస్తుతం బాలిక గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుడిపై లైంగికదాడి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి విచారణ జరుపుతున్నటు ఎస్సై పేర్కొన్నారు.

# సంక్షేమ పథకాలు అందుతున్నాయా?

- గ్రామాల్లో కేంద్ర బృందం ఆరా



ఘన్‌పూర్‌లో మహిళా సంఘాలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

ఆర్మూర్‌టౌన్/మాక్లూర్/నవీపేట/ డిచ్‌పల్లి , మే 28: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా అని కేంద్ర బృందం అధికారులు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సెక్షన్ ఆఫీసర్స్ ట్రెయినింగ్ పోగ్రాంలో భాగంగా సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్ ఆఫీసర్లు జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం పర్యటించారు. పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్ ఆఫీసర్లు భాను ప్రతాప్‌సింగ్, జైపాల్ మౌర్య, దివ్య సింగాల్, హరివిందర డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్, నడ్పల్లి గ్రామ పంచాయతీలను సందర్శించారు. మహిళా సంఘాలు, అధికారులతో సమావేశాలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి యోహాన్, ఎంపీడీవో లింగంనాయక్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఆర్ఐ సంతోష్, పంచాయతీ కార్యదర్శులు రాధిక, రమేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆర్మూర్ మండలంలోని అంకాపూర్‌లో కేద్రం బృందం సభ్యులు అధికారులతో సమావేశం నిర్వహించారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్, ముల్లంగి (బీ) గ్రామాల్లో నాలుగు శాఖలకు చెందిన కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. గ్రామాల్లో పంచాయతీలకు మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు, ఈజీఎస్ ద్వారా గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను ఎంపీడీవో లక్ష్మారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రం బృందం సభ్యులు, ఏపీవో ఓంకార్, కార్యదర్శులు తదితరులున్నారు. నవీపేట మండలంలోని జన్నేపల్లి, అబ్బాపూర్(ఎం) గ్రామాల్లో బృందం సభ్యులు పూనమ్ గోయల్, మనీషా, మనీశ్, రాకేశ్‌కుమార్ పర్యటించారు. పథకాల పనితీరు ఎలా ఉన్నదని ఎంపీడీవో నాగనాథ్, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీవో రామకృష్ణ, ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్‌తో పాటు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జన్నేపల్లి గ్రామ కార్యదర్శి కవిత, అబ్బాపూర్ కార్యదర్శి , వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాహన అద్దాలపై బ్లాక్ ఫిల్మ్ అతికించొద్దు



కారుకు వేసిన బ్లాక్ ఫిల్మ్ తొలగిస్తున్న పోలీసులు

వినాయక్‌నగర్, మే28: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్లు, జీప్‌లు ఇతర ఫోర్ వీలర్ వాహనాల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ అతికిస్తే వాహనదారుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఆర్ఐ వినోద్, ఆర్ఎస్ఐ సుమన్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. కార్ల అద్దాలపై అతికించిన బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించి, వారికి జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ నిబధనల ప్రకారం కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వేయడం నేరమని అన్నారు. బ్లాక్ ఫిల్మ్ వేసిన వాహనం కూర్చున్న వారు బయటి వారిక కనబడకపోవడంతో అనేక నేరాలు జరుగుతున్నాయని అన్నారు. వాహనాల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ అతికిస్తే చట్టరిత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# లారీ ఢీకొని వ్యక్తి మృతి

వినాయక్‌నగర్, మే28: నిజామాబాద్ నగర శివారులోని దుబ్బా ప్రాంతంలో బుధవారం ఉదయం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న దుబ్బా ప్రాంతానికి చెందిన సుంకరి.నర్సయ్య(68)ను అటువైపుగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. చికిత్స నిమిత్తం సదరు వ్యక్తిని జిల్లా దవాఖానకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందాడడని చెప్పారని త్రీ టౌన్ ఎస్సై హరిబాబు వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు సీజ్ చేశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దరాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# వివాదాస్పద స్థలం పరిశీలన

వర్ని, మే 28: మండల కేంద్రంలోని సిద్దాపూర్ రిజర్వాయర్ వద్ద అటవీ, రెవెన్యూ శాఖల భూముల మధ్య వివాదాస్పద వివాదాస్పద స్థలాన్ని బుధవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, మండల సర్వేయర్‌తో కలిసి పరిశీలించారు. సంబంధిత విభాగాలకు వివరణాత్మక రిపోర్టును సమర్పించామని సర్వేయర్లు అధికారులకు తెలియజేశారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ సాయిలు ఉన్నారు.

# మద్యంతాగి వాహనం నడిపిన ఇద్దరికి జైలు శిక్ష

ఇందల్వాయి, మే 28: ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి కోర్టు జైలు శిక్ష విధించిందని ఎస్సై సందీప్ బుధవారం తెలిపారు. రెండు రోజుల క్రితం ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో పరిధిలో మద్యంతాగి వాహనాలు నడిపిన మిట్టాపల్లికి చెందిన దాసు, బాలాపూర్‌కు చెందిన సుదర్శన్‌ను బుధవారం కోర్టులో హాజరుపర్చగా జిల్లా న్యాయమూర్తి ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడపటాన్ని చట్టరీత్యా నేరమని ఎస్సై తెలిపారు.

# నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన సదస్సులో సీపీ సాయి చైతన్య

వినాయక్‌నగర్, మే28: నూతన న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో సీపీ ఆధ్వర్యంలో నూతన నేర న్యాయ చట్టాలపై మీడియా ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ పాత చట్టాలను సవరించి, కేంద్ర ప్రభుత్వం 2024 జూలై 1న కొత్తగా ప్రవేశపెట్టిందని అన్నారు. 1. భారతీయ న్యాయ సంహిత, 2.భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, 3.భారతీయ సాక్ష్యా ఆధినియం అనే చట్టాలు అమలులోకి వచ్చాయని అన్నారు. నేర వార్తల విషయంలో విలేకరులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ(ఆడ్మిన్)బస్వారెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఏసీపీ ఎల్.రాజావెంకట్‌రెడ్డి, జె.వెంకటేశ్వర్ రెడ్డి, పి.శ్రీనివాస్, మస్తాన్ అలీ, రూరల్ ఎస్సై మహ్మద్ ఆరీఫ్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహావిష్కరణ



కోనాపూర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్, మే 28 : బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాసరెడ్డి దళిత నాయకులు, గ్రామపెద్దలతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించిన ఘనత డాక్టర్ అంబేద్కర్‌కు దక్కిందని అన్నారు. దూర దృష్టితో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం కల్పించేలా రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు మైశయ్య, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, దళిత నాయకులు నెర్రె నర్సింహులు, మన్నె చిన్న సాయిలు, ప్రశాంతి, రవి, సాయిలు, రాములు, బేగరి పాపయ్య, వినోద్, గ్రామ పెద్దలు రాజేశ్వర్‌గౌడ్, గంగారాం, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్, సాయిలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడ మండలంలోని కోనాపూర్‌లో బుధవారం లబ్ధిదారులు, అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. డీఎల్పీవో సత్యనారాయణరెడ్డి, ముజాహిద్, హౌసింగ్ డీఈ గోపాల్, ఏఈ హన్మంతు, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, గంగారాం, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# తాళాలు వేసిన రెండిండ్లలో చోరీ

నవీపేట, మే 28: మండల కేంద్రంలోని స్టేషన్ ఏరియాలో తాళాలు వేసి ఉంచిన రెండు వేర్వేరు ఇండ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఏఎస్సై మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లికి చెందిన పిట్టల అశోక్ ఉద్యోగ రీత్యా నవీపేట మండలానికి వచ్చాడు. కొంత కాలంగా మండల కేంద్రంలోని స్టేషన్ ఏరియాలో అద్దె ఇంట్లో భార్యతో ఉంటున్నాడు. ఈ నెల 25న అశోక్ డ్యూటీకి వెళ్లగా ఆయన భార్య సుమలత ఇంటికి తాళం వేసి ధర్పల్లి మండలం రేకులపల్లికి ఫంక్షన్‌కు వెళ్లింది. ఈ నెల 26 న ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగుల గొట్టి 25 తులాల వెండి ఆభరణాలను అపహరించి పారిపోయారు. అలాగే స్టేషన్ ఏరియాకు చెందిన సయ్యద్ జలీల్ అనే ప్రైవేటు ఉద్యోగి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగుల గొట్టి బీరువాను ధ్వంసం చేసి రెండు ఐఫోన్లతోపాటు మూడు వెండి ఉంగరాలు, గ్రామున్నర బంగారు ఉంగరం, కొంత నగదును దొంగిలించి పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

# విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సిరికొండ, మే28: మండలంలోని కొండూర్ గ్రామంలో విద్యుదాఘాతంతో బుధవారం వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. సుద్దులం గ్రామానికి చెందిన నవీన్ (30) కొండూర్ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లాడు. నవీన్ బయటికి మూత్ర విసర్జణకు వెళ్లగా గ్రామంలోని కిందికి వేలాడుతున్న 11కేవీ విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి విద్యుత్ అధికారులు న్యాయంచేయాలంటూ గ్రామస్తులు, మృతుడి బంధువులు ధర్నా చేశారు. పలు మార్లు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్నా విద్యుత్ తీగలను సరి చేయలేదని గ్రామస్తులు అన్నారు. సీఐ భిక్షపతి, ఎస్సై ఎల్.రామ్ వెళ్లి వారికి నచ్చజెప్పి, విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

### ధర్మారం గ్రామంలో..

నవీపేట, మే 28: మండలంలోని ధర్మారం గ్రామంలో బుధవారం ఓ వృద్ధుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృత్యువాత పడినట్లు ఏఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి గోవిందరం గంగారాం(77) గ్రామ కమిటీ ఇచ్చే కొద్ది పాటి వేతనంతో గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయం శుభ్రం చేసి గుడిలో ఉన్న మైక్ ద్వారా భక్తి పాటలు ఆన్‌చేస్తూ ఉంటాడు. బుధవారం గుడిలో శుభ్రం చేసి భక్తి పాటల రికార్డ్ ఆన్ చేసి పక్కన ఉన్న షెడ్డును శుభ్రం చేసేందుకు వెళ్లాడు. షెడ్డు శుభ్రం చేస్తుండగా గాలి వానకు కరెంట్ మీటర్ నుంచి సర్వీస్ వైర్ రేకుల షెడ్డుకు తగిలి విద్యుదాఘాతంలో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడి కూతురు గోదావరి ఫిర్యాదు మేరకు శవాన్ని పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.